ఉత్తమ పురస్కార గ్రహీత జాన్‌బాబుకు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండల విద్యాశాఖ కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న బద్రి జాన్‌బాబుకు రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం ఉప్పలగుప్తం విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒలు కె.కిరణ్ బాబు, ఎస్.సత్యకృష్ణ దుశ్శాలువాలు కప్పి సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖసిబ్బంది కె.వెంకటేశ్వరరావు, ఎన్.గంగాధరరావు, కె.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, పండు మురళి, మంచెం లవ కుమార్, కె.సత్తిబాబు, జె.నాగలక్ష్మి, అయితాబత్తుల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


సత్కరిస్తున్న ఎంఇఒలు కిరణ్ బాబు, సత్యకృష్ణ,సిబ్బంది

పట్టభద్రులు ఎటువైపు?

- ముగిసిన నామినేషన్ల పర్వం
- తీర్పు కోసం పెరుగుతున్న ఆసక్తి
- నిజాయతీ, నిబద్ధతతకే మళ్లీ అవకాశమంటున్న విశ్లేషకులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సాధారణ ఎన్నికలు ముగిసిన ఆరు నెలల తర్వాత వెంటనే మండలి పోరుకు నగారా మోగింది. హోరాహోరీగా జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ఘన విజయాన్ని అందుకున్నారు. కార్పొరేట్ అభ్యర్థులకు చోటు ఇవ్వబోమని గురువులు మరోమారు నిరూపించారు. ఆ వెంటనే పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు తెరమీదకు వచ్చాయి. ఈనెల 27న పోలింగ్, వచ్చేనెల 3న ఓట్లు లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి ఈ ఎన్నికల వైపు మళ్లింది. ఈ తరుణంలో పలువురు ఆశావహులు పోటీకి సై అంటున్నారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఈనెల 10 వరకూ నామినేషన్లను స్వీకరించగా 59 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఇందులో కొంతమంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈనెల 13వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఇచ్చారు.

విద్యా వంతుల తీర్పు కోసం

ఉభయగోదావరి జిల్లాల్లో విద్యావంతులు తీర్పుకోసం ఆసక్తి పెరుగుతుంది. పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారనే దానిపై ఎవరి అంచనాల్లో వారున్నారు. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో మొన్నటి ఉపాధ్యాయ నియోజకవర్గ ఫలితాలే పునరావృతం అవుతాయని పలువురు అంచనాలు వేస్తున్నారు. కార్పొరేట్ తాయిలాలు, ప్రలోభాలను తిప్పికొట్టి నిజాయతీ, నిబద్ధతతో సాగే వారినే ఆదరిస్తారని అంతా బావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి తరపున టిడిపి నేత పేరాబత్తుల రాజశేఖరం బరిలో నిలిచారు. ఆయనతోపాటు మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు సుందర్ కూడా ప్రధానంగా పోటీలో ఉండడంతో పట్టబద్రుల ఎన్నికలు ఆశక్తిగా మారాయి. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్స్ ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తికరంగా మారింది.

పిడిఎఫ్ దే హవా...

గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజక వర్గాలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. పిడిఎఫ్ అభ్యర్థులే ఈ నియోజకవర్గాల్లో విజయం సాధించారు. ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు పలుమార్లు ప్రయత్నించినప్పటికి ప్రజా సంఘాల అభ్యర్థులకే అంతకంతకూ ఆదరణ లభిస్తోంది. కార్పొరేట్ సంస్థల ప్రతినిధుల మధ్య ఓట్లు చీలిన ప్రతి సందర్భంలోనూ పిడిఎఫ్ గెలుస్తూ వస్తుంది. శాసన మండలి పునరుద్ధరణ తర్వాత తొలిసారిగా 2007లో జరిగిన ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన కచ్చా జార్జివిక్టర్ అనూహ్య విజయం సాధించారు. పట్టభద్రుల స్థానంలో నిలిచిన ఆయన విజయం ఓటర్ల విజ్ఞతకు నిదర్శనంగా అందరూ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజా సమస్యల్నీ, పట్టభద్రుల సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించేందుకు ఆయన ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో కార్పొరేట్ విద్యాసంస్థల అధినేతగా ఉన్న కె.రవికిరణ్ వర్మ గెలుపొందారు. అయితే పట్టభద్రుల సమస్యల విషయంలో చొరవ చూపలేకపోయారనే అభిప్రాయం ఆయనపై సర్వత్రా ఏర్పడింది. ఆ తర్వాత 2019లో పట్టభద్రుల స్థానం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రతినిధి అయిన ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) బరిలోకి దిగి భారీ విజయాన్ని సాధించారు. ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందారు. ప్రత్యర్థులు నాటి ఎన్నికల్లో కోట్లు కుమ్మరించినా పట్టబద్రులు విజ్ఞతతో ఐవికి పట్టం కట్టారు. ఈ తరుణంలో ప్రస్తుత ఎన్నికల్లో కూడా పలువురు బడా బాబులు రంగంలోకి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో పట్టభద్రులు మరోసారి ఎవరికి పట్టం కడతారనే చర్చ జోరుగా సాగుతోంది. ఈసారి కూడా పిడిఎఫ్‌దే విజయం అంటూ కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కూటమిపై అసంతప్తి

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కూటమి నేతలు చెప్పుకొచ్చారు. తీరా అధికారంలోకొచ్చిన తర్వాత ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో ఆగ్రహంతో ఉన్నారు. డిఎస్‌సి పోస్టులు కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదంటూ ఆగ్రహం చెందుతున్నారు. ఎనిమిది నెలలైనా ఉద్యోగులకు కనీసం ఒక్క డిఎ కూడా ఇవ్వలేదు. పిఆర్‌సి కమిషన్ రద్దు చేసినప్పటికీ ఇప్పటివరకు కొత్త పిఆర్‌సి కమిషన్ వేయలేదని ఉద్యోగుల్లో సైతం అసంతృప్తి ఉంది. ఐఆర్ ఊసే లేకుండా పోయిందని కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఆర్థిక బకాయిలు అతీ గతీ లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ నేత, పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులను గెలిపించుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాలు, కార్మిక, కర్షక సంఘాల నాయకులు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

రాఘవులు విజయం కోసం విస్తృత ప్రచారం

ప్రచారం చేస్తున్న టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపి కృష్ణమూర్తి

ప్రజాశక్తి- ఐ.పోలవరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపి కృష్ణ మూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్ మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపికృష్ణ మూర్తి హాజరయ్యారు. ఐ.పోలవరం, కేశనకుర్రు, మురమళ్ళ, టి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రయివేటు, ప్రభుత్వ విద్యా సంస్థల వద్దకు వెళ్లి ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ వీరరాఘవులు ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘాల్లో వివిధ హోదాల్లో పని చేసి ఉద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తి అని అన్నారు. అటువంటి వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి అధికారంలో రాగానే మొట్టమొదటిగా సిఎం చంద్రబాబు డిఎస్‌సి ఫైల్‌పై సంతకం చేశారన్నారు. కానీ నోటిఫికేషన్ ఇవ్వడం మర్చిపోయారని అన్నారు. తల్లికి వందనం లేదు, ఉచిత బస్సు లేదు, నిరుద్యోగ భృతి లేదు, ప్రతి మహిళకు రూ.1500 లేదన్నారు. ఈ హామీలన్నింటినీ మర్చిపోయారన్నారు. కూటమి హామీలను గుర్తు చేయాలంటే పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులకు .మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

కోటిపల్లిలో శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

సమీక్షలో మాట్లాడుతున్న రామచంద్రపురం ఆర్‌డిఒ అఖిల

ప్రజాశక్తి - కె.గంగవరం

ఈనెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలపై రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల మంగళవారం కోటిపల్లిలోని సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని మంచినీటి సదుపాయం పారిశుధ్యం పై గ్రామపంచాయతీ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, ఉన్న స్నానాలు ఆచరించే రేవులో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. అదేవిధంగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని అదేవిధంగా ఆలయంలో యాత్రికులకు క్యూలైన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని ఆమె దేవస్థానం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డిఎస్‌పి రఘువిర్, సిఐ వెంకటనారాయణ, ఉత్సవ కమిటీ నాయకులు రేవు శ్రీను, ఎంపిపి పంపన నాగమణి, వాసంశెట్టి సత్యం, ఆలయ ఇఒ జొన్నాడ భీమశంకరం, ఎంపిడిఒ నందమూరి శ్రీనివాసు, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తదుపరి సమావేశం ఫిబ్రవరి 22 ఏర్పాటు చేస్తామని ఈ లోగా ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆర్‌డిఒ అధికారులకు ఆదేశించారు.

గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు

పెదపల్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయి కిశోర్

అంగరలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నకుమారి

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పిఎంఎంఎస్‌ఎ) పథకంలో భాగంగా మంగళవారం పలు మండలాల్లోని పిహెచ్‌సిల్లో గర్భిణులకు, బాలింతలకు వైద పరీక్షలు నిర్వహించారు. అనంతర వారికి తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలను వివరించారు.

ఆలమూరు: మాతత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంఎంఎస్‌ఎ దోహదపడుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పిహెచ్‌సి వైద్యాధికారులు డి,సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ అన్నారు. పిఎంఎంఎస్‌ఎ పథకంలో భాగంగా ఆయా పిహెచ్‌సిలలో నిర్వహించిన పిఎంఎంఎస్‌ఎ శిబిరంలో సుమారు 113 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది వివరించారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోకుష్టు వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు.డిపిఎంఒ కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను అందజేశారు. కుష్టువ్యాధి నివారణకు అధునాతనమైన ఎంవైటి చికిత్స ఆందుబాటులోకి వచ్చినందున రోగులు అధైర్య పడవద్దని వైద్యాదికారులు సువర్చలాదేవి, సాయి కిషోర్ సూచించారు. ఎంపిహెచ్ఇఒ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఎవివి.రాజా, బి.సూర్య నారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి,ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** అంగర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ పి.రత్నకుమారి 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశారు. అనంతరం గర్భిణులు తీసు కోవలసిన జాగ్రత్తలు , పౌష్టికాహారం, ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను డాక్టర్ రత్నకుమారి, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, వివరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ జె.బంగారు పాప, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎంఎల్ హెచ్‌పి కె.రమా దేవి, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వారం రోజులు కోడిగుడ్లు నిలుపుదల చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్ల మృత్యువాత పడుతున్న నేపథ్యంలో వారం రోజులపాటు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సాంఘిక, వెనుకబడిన తరగతుల వసతి గృహాలు, గురుకుల పాఠశాలలలో ఉన్న పిల్లలకు కోడిగుడ్లను అందించడం నిలుపుదల చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జిల్లాస్థాయి అధికారులతో కలిసి తహశీల్దార్లు, ఎంపిడిఒ లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి బర్డ్ ఫ్లూ వ్యాప్తిపై సమీక్షించారు. జిల్లాలో వివిధ మండలాలలో 18 కమర్షియల్ పౌల్ట్రీలలో సుమారు 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయని ఇప్పటివరకు అయితే బర్డ్ ఫ్లూ జిల్లాలో గుర్తించబడలేదని పశుసంవర్ధక శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బర్డ్ ఫ్లూ సోకితే కోళ్లన్నీ ఒక్కసారిగా చనిపోతాయని అలా చనిపోయిన కోళ్లను వైరస్ వ్యాప్తి చెందకుండా భూమిలో పూడ్చిపెట్టాలని కలెక్టర్ కు వివరించారు. అధిక ఉష్ణోగ్రతలలో ఈ వైరస్ బతకలేదని ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ ప్రభావం తగ్గవచ్చు అని అధికారులు తెలిపారు. తదనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో కోళ్లలో బర్డ్ ఫ్లూ వైరస్ నిర్ధారణయిన నేపథ్యంలో జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా అధికారులు పౌల్ట్రీ యజమానులను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో వారం రోజులపాటు కోడిగుడ్లను అందించడం నిలిపివేయాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు ఇప్పటికే సరఫరా చేసిన గుడ్లను బాగా ఉడికించి తినేలా అవగాహన కల్పించాలన్నారు. మాంసం దుకాణాలలో మాంసాన్ని విక్రయించే వారు వైరస్ బారిన పడే అవకాశం ఉన్న నేపథ్యంలో మాస్కులు, చేతికి గ్లౌజులు, రక్షణ సామగ్రి ధరించే విధంగా రెవెన్యూ డివిజనల్ అధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలన్నారు. వ్యక్తులు, సామాజిక మాధ్యమాలు ద్వారా, ఏ విధంగానైనా అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని వార్త తెలిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మూర్తి, పీడీ ఐసిడిఎస్ బి.శాంతి కుమారి, డిఎంహెచ్ఒ దుర్గారావు దొర, మండలాల నుంచి ఎంపిడిఒలు, తహశీల్దారులు,అ ధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఈ-శ్రమ్'తో బహుళ ప్రయోజనాలు

బట్టీ కార్మికులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు

ప్రజాశక్తి - ఆలమూరు

అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉపాధి చట్టాలను చేరువ చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన పథకం ఈ-శ్రమ్, ఇందులో నమోదు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయని మండపేట సహాయ కార్మిక అధికారి కాశీ నాగమల్లేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం పలు ఇటుకబట్టీలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. అనంతరం బట్టీల వద్ద రికార్డులను పరిశీలించారు. రికార్డులలో ఉన్న లోపాలను సవరించుకోవాలని యజమానులకు ఆయన సూచించారు. ఎవరూ చదువుకునే పిల్లలను పనిలో పెట్టుకోవద్దని తెలిపారు. ఎవరైనా బాలలు పని కావాలని వచ్చినా, తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పనిలో చేర్పించడానికి చూసినా యజమానులు వారికి పని ఇవ్వకుండా వెంటనే తనకు సమాచారం అందించాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని అయితే అవగాహన లేక కార్మికులు ప్రయోజనాలు పొందడంలో విఫల మవుతున్నారని అన్నారు. కార్మికులు యజమానులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, నమోదు చేయించుకోవాలని సూచించారు.

గుండెపోటుకు అందుబాటులో ఇంజక్షన్

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజ్ కుమార్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గుండెపోటుకు సంబంధించిన ఖరీదైన ఇంజక్షన్ ఉచితంగా అందుబాటులోకి వచ్చిందని కపిలేశ్వరపురం సిహెచ్ సి ఆసుపత్రి వైద్య నిపుణులు, సూపరిండెండెంట్ డాక్టర్ పి.రాజ్ కుమార్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మండలంలోని ఎఎన్‌ఎంలకు, ఆశా వర్కర్లకు గుండె వ్యాధి పట్ల అవగాహనా సదస్సు నిర్వహించారు. గుండెపోటు వచ్చేవారికి ఆయాసం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతి నొప్పి, దడ, స్పృహ కోల్పోవడం ఉంటుందని వివరించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నందు అత్యవసర వైద్యానికి అన్ని ఏర్పాట్లు ఉన్నాయని వారు వివరించారు. విపత్కర పరిస్థితిలో వైద్యం పొందినప్పుడే ప్రాణహాని ఉండదన్నారు. గుండెపోటుకు గురైన వారికి వైద్య నిమిత్తం హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.45 వేల విలువ గల ఇంజక్షన్ ఉచితం గా అందజేస్తారన్నారు. ఎవ రికైనా గుండె నొప్పి వస్తే తక్షణం కపిలేశ్వరపురం ఆసుపత్రిలో ఇసిజి తీసి వారికి ఈ ఇంజక్షన్ అవసరమైతే వెంటనే అందిస్తారని, తదితర అంశాలపై డాక్టర్ రాజ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చెల్లూరి భాస్కరవెంకట సారథి, డాక్టర్ ఎం. దుర్గాదేవి, డాక్టర్ కె.శ్రావణి, డాక్టర్ సిహెచ్.రాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పలు గ్రామాల ఎఎన్‌ఎం లు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



17 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోతవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ద్వితీయ పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివరాలను కమిటీ ఆలయ ప్రాంగణంలో మంగళవారం విలేకరులతకు తెలియజేశారు. గత ఏడాది జరిగిన ఉత్సవాలకు యాత్రికులుకు విశేష సంఖ్యలో పాల్గొన్నారని అన్నారు. ఈ సంవత్సరం కూడా ప్రతి ఒక్కరూ చింతలూరులో నిర్వహించే వెంకన్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు.

చింతలూరులో వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

విద్యార్థులకు ప్లేట్లు, స్టేషనరీ అందజేస్తున్న ఎజిపి విద్యా ప్రసన్న

ప్రజాశక్తి - ఆలమూరు

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎజిపి బూసి విద్యాప్రసన్న అన్నారు. స్థానిక, కొత్తపేట న్యాయస్థానములలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, స్థానిక ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఛైర్మన్‌గా ఉన్న విద్యా ప్రసన్న మంగళవారం మండలంలోని పెనికేరు ఎంపిపి పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులందరికీ భోజనం ప్లేట్లు, స్టేషనరీ, వాటర్ బాటిల్స్, పుస్తకాలు పండ్లను ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి బహూకరించిన ఎజిపి విద్యా ప్రసన్నను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నేతలు ముప్పిరి వెర్రియ్య, రాము, చిన్నా, ప్రధాన ఉపాధ్యాయులు ముంగమూరి దాసు, ఉపాధ్యాయులు సింగారపు రామారావు, గ్రామపెద్దలు భాస్కరరావు, దత్తుడు, రవి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి దాత విరాళం అందజేశారు. మంగళవారం నరసాపురానికి చెందిన కైలా సత్తిష్ కుమార్, లావణ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.51,116 ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు వకుళ మాత అన్నదాన భవన నిర్మాణం కోసం అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాల, స్వామివారి చిత్రపటం అందజేసి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పిన డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

ప్రజాశక్తి - మామిడికుదురు

డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో వైసిపి నుంచి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) లోకి పలువురు మంగళవారం చేరారు. ఈ చేరికలతో పూర్వ వైభవం సంతరించుకుందని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నగరంలో అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి కాంగ్రెస్ పార్టీలోకి కొంతమంది నాయకులను ఆహ్వానించారు. వారికి డిసిసి అధ్యక్షులు చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చేరికలు ద్వారా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. వైసిపికి చెందిన అల్లవరం మండలం నుంచి బొంతు విజయ్‌కుమార్, మాజీ ఎంపిటిసి సభ్యుడు వాసంశెట్టి వెంకటేశ్వరరావు, ఉప్పలగుప్తం మండలం నుంచి నడింపల్లి సుబ్బరాజు, పండు రవికుమార్లు వైసిపికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నీతిపూడి బాల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ, బత్తుల సురేష్ బాబు, అయితాబత్తుల కుమార్ సింగ్, కె. .శ్యామ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

రబీ సాగులో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్ లో వ్యవసాయం, ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులతో కలెక్టర్ సమావేశమై క్షేత్రస్థాయిలో రబీ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లవరం, ఉప్పలగుప్తం, మామిడికుదురు, ముమ్మిడివరం మండలాల్లో శివారు భూముల్లో సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. వ్యవసాయం ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి వినియోగదారుల సంఘాల సభ్యులతో సమావేశమై ఏ ఏ ప్రాంతాల్లో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారో గుర్తించాలన్నారు. ప్రస్తుతం వంతుల విధానంలో సాగునీరు అందిస్తున్నామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ కి వివరించారు. వంతుల విధానం లో భాగం గా ఏ ఏ ప్రాంతాల్లో ఎప్పుడెప్పుడు సాగునీరు అందుతుందో రైతులకు ముందస్తుగానే సమాచారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకొని రైతులకు సాగునీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో సాగునీటి సరఫరా లో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించి ఫిబ్రవరి 13 లోపు క్రాస్ బండ్లు ఏర్పాటు అవసరం ఉన్న డ్రెయిన్లు,కాలువల వివరాలను సమర్పించాలన్నారు. అవసరమైన చోట్ల క్రాస్ బండ్లు ఏర్పాటు చేసి సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు,ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, డ్రెయిన్స్ డిఇఇ కిషోర్, వ్యవసాయం, ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి రావులపాలెం గౌతమి గోదావరి బ్రిడ్జి కింద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. గౌతమి గోదావరి బ్రిడ్జి కింద మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక వీఆర్ఓ సమాచారంతో పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు 5 అడుగులు4 అంగుళాలు, పొడవు జుట్టు, నీలిరంగు చీర, నీలిరంగు జాకెట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం బంధువులు గుర్తుపట్టేందుకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు వివరాలు తెలిసినవారు సిఐ 9440796567, ఎస్ఐ 8712689529 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పిఠాపురం

అక్రమంగా రవాణా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మండలంలోని దుర్గాడ గ్రామంలో అక్రమంగా రవాణా చేస్తున్న వాహనంతోపాటు, 2,550 కేజీల పిడిఎస్ బియ్యాన్ని సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ స్వాధీనం చేసుకున్నారు. దుర్గాడ గ్రామానికి చెందిన కర్రి కృష్ణను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు.అలాగే పిఠాపురం మండలం ఎస్.కె పాలెం గ్రామంలో కె సూరిబాబు నివాసంలో నిల్వ చేసిన 1.6 టన్నులు పిడిఎస్ బియ్యంతోపాటు, బి పత్తిపాడు గ్రామంలో రైస్ మిల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గ్రామానికి చెందిన వి.రాజుశివశంకర్, వి.చిన్నబాబ్జిలకు చెందిన 14.4 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యంతోపాటు, లారీ, బొలెరో వాహనాన్ని సీజ్ చేసి, నలుగురిని అరెస్టు చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గుణశేఖర్ తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని పెనుమళ్ళలో నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ మీడియాకు వివరించారు. పోలీసులకు అందిన సమాచారంతో మండలంలోని పెనుమళ్ళలో నిర్వహిస్తున్న కోడి పందాలుపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,500 నగదు, 2 కోళ్లు రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులకు జీవ, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కణం, దాని అంతర్ నిర్మాణం, వృక్షకణం, జంతు కణాల మధ్య భేదాలు, ఉల్లిపాయ కణ నిర్మాణం సూక్ష్మ దర్శిని ద్వారా పరిశీలించడం, కాంతి పాఠ్యాంశంలోని కాంతి కిరణాల ఏర్పాటు, పరావర్తన సూత్రాలు, పటకం ద్వారా కాంతి పరిక్షేపన, వివిధ రకాల కోణాలతో సమతల దర్పణాల మధ్య ఏర్పడే ప్రతిబింబాల సంఖ్య, కాంతి జనకాను ఉపయోగించి నీడలు ఏర్పడటం వంటి ప్రయోగాలపై అవగాహన కల్పించారు.

18న స్థాయీ సంఘాల సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు 1 నుంచి 7 వరకూ సమావేశం ఈనెల 18వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించడం జరుగుతుందని జడ్‌పి సిఇఒ వివిఎస్.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సంచార కుటుంబాలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-వాలు తిమ్మాపురం రహదారిలోని టిడ్కో గృహ సముదాయం సమీపంలో నివాసముంటున్న సంచార కుటుంబాలకు అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు, పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. స్థానిక కస్పాపేటలో జరిగిన కార్యక్రమంలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఇనుమర్తి పవన్ అందజేశారని, వాటిని సంచార కుటుంబాల వారికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్-ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారంతో ముగిసింది. చివరి రోజున సురక్షితమైన ఇంటర్నెట్ ఉపయోగించడంపై ఎన్ఐసి సెంటర్ రీసోర్సు పర్సన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. హ్యాకింగ్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఎలా ఉండాలి అన్న అంశంపై వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాది కమిడి విజయ్‌కుమార్ సెక్స్ వర్కర్లు, బాలల హక్కులు, విద్య అంశాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ శిబిరంకు సంబంధించి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ శాంతికుమార్, ఎన్ఎస్ఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చెల్లి నరేష్, ఎస్.శ్రీనివాస్, డాక్టర్ ముత్యాలుపాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ షఫీవుల్లాకు వినతి అందజేస్తున్న చిలకలపాడు గామస్తులు

సమస్యల పరిష్కారానికి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి శివారు చిలకలపాడుకు చెందిన గ్రామ కంఠం, వక్ఫ్ భూమి సమస్య పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డ్ ఆడిటర్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ షఫీవుల్లా, వక్ఫ్ బోర్డ్ మరో అధికారి షేక్ రసూల్ జానీలని వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ చిలకలపాడుకు చెందిన మేమంతా పేద, మధ్య తరగతి చిన్న, సన్న కారు రైతులమని అన్నారు. ఈ గ్రామకంఠం పరిధి మొత్తం సర్వే నెంబరు 206/3 పూరా 8.88ఎకరాలు ఉందన్నారు. ఇందులో మా పూర్వీకుల నుంచి శతాబ్దాల కాలంగా వివిధ రూపాల్లో గహాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తూ వస్తున్నామన్నారు. ప్రస్తుతం మా తరం వారివి ఇందులో సుమారు 300 వరకు ఇల్లు ఉన్నాయన్నారు. వాటి యొక్క వారసత్వ మార్పుల రిజిస్ట్రేషన్లు 2018 వరకు సజావుగానే జరిగాయన్నారు. ఇప్పుడు మా గ్రామ పరిధిలో వక్ఫ్ భూమి ఉందని, మొత్తం గ్రామానికి సంబంధించి లావాదేవీలు నిలుపుదల చేశారని వారు వాపోయారు. మొత్తం నుంచి వక్ఫ్ భూమి సబ్ డివిజన్ చేసి మా సమస్య పరిష్కరించాలని వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ను కోరినట్లు వారు తెలిపారు. దీనిపై ఆయన మా నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారని అన్నారు. తహశీల్దార్‌కు మీ అర్జీని పంపించి సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని వారన్నారు. వినతిపై స్పందించిన వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షఫీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి బుజ్జి, చెక్కపల్లి చిట్టిబాబు, కొత్తపల్లి వెంకన్న, గంగిశెట్టి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు దుర్గారావును సన్మానిస్తున్న బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షులు

ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఈదరపల్లి గ్రామానికి చెందిన కడిమి వెంకట సత్య దుర్గారావును మంగళవారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో రాష్ట్ర బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షులు వై.హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 2018 ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ప్రతిభ కనబరిచిన సందర్భంగా ఇటీవల రాజమహేంద్రవరం ధర్మంచర ఫంక్షన్ హాల్‌లో ఫిలాంత్రోఫి సొసైటీ, పానీండియా వారిచే గోదావరి ఉత్సవం 2025 సందర్భంగా ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి, గజల్ శ్రీనివాస్‌లు అద్దంకి రాజా అధ్యక్షతన దుర్గారావు ను సత్కరించారు. వారితో పాటు జిల్లా బిఎస్ఐ అధ్యక్షులు కాశీ రాంభోది, సాకుర్రు మాజీ సర్పంచ్, సెక్రటరీ ములపర్తి సత్యనారాయణ, ఎన్.ప్రసాదరావు, కె.వెంకటరావు, ఇవివి సత్యనారాయణ తదితరులు సన్మానించారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రథోత్సవంలో పాల్గొన్న యాత్రికులు

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కళ్యాణోత్సవాలోకల భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి రథాన్ని ద్రాక్షారామ పురవీధులలో ఊరేగించారు. భీమేశ్వర స్వామి శ్రీ మాణిక్యాంబ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ద్రాక్షారామ ఆలయం నుంచి వేలంపాలెం మీదుగా మెయిన్ రోడ్డు ద్రాక్షారామ మార్కెట్ సెంటర్ నుంచి వేగాయమ్మపేట వరకు రథోత్సవ నిర్వహించారు. బ్యాండ్ వాయిద్యాలు, ప్రత్యేక కోలాటాలు, వివిధ రకాలైన వేషాలు బాణసంచా కాల్పులతో రథోత్సవం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించారు. అనంతరం వేగాయమ్మ పేటలోని స్వామి వారి ఆస్థాన మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ అల్లు వెంకట దుర్గాభవాని, వేద పండితులు అర్చక పురోహితులు తదితరులు పాల్గొన్నారు. యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రభుత్వాలు అందించే పథకాల కోసం రైతులు తప్పని సరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.విశ్వాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సొంత భూమి కలిగిన రైతులు ఈ-పంట కోసం ఈ-కెవైసి, అగ్రి స్టాక్ రైతు రిజిస్ట్రేషన్‌కు ఈనెల 15 చివరి తేదీగా నిర్ణయించారన్నారు. మండలంలో 12,500 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇప్పటివరకు 11,285 ఎకరాలు మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు తరహాలో ప్రభుత్వం 11 అంకెలతో కూడిన ఫార్మర్ ఐడి కార్డులు జారీ చేస్తారని, ఇకపై రైతులకు చెందిన అన్ని వివరాలు ఆ కార్డు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, ఆధార్ కార్డు కు లింక్ అయిన ఫోన్ నెంబర్ వెంట తీసుకొని రావాలన్నారు.

పిహెచ్‌సిలను పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పెరవలి

మండలంంలో పిహెచ్‌సిలను జిల్లా ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు కానూరు, పెరవలి పిహెచ్‌సిల పరిధిలో పౌల్ట్రీ ఫామ్‌లో బర్డ్ ఫ్లూ ప్రబలు తున్న కారణంగా సిబ్బందిని అప్రమత్తం చేశారు. మంగళవారం నుంచి వారం రోజులపాటు గ్రామ సచివాలయం పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించాలన్నారు. పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పరిస్థితి పర్యవేక్షించారు. రాబోయే ఐదారు రోజుల్లో గ్రామాల్లో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి వివిధ శాఖల అధికారులు సహకారంతో పరిస్థితిని అదుపులో ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సిడిసి సర్వేలో నివాస గృహ సందర్శనాలు చేసి క్యాన్సర్, బిపి షుగర్ వ్యాధి, రక్త హీనత బిఎంఎస్ సంబంధించిన లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. వారిని హయ్యర్ హాస్పిటల్స్‌కు రిఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి రాబోయే రెండు వారాల్లో అన్ని కార్యక్రమాల్లో 100 శాతం ప్రగతి సాధించాలని ఆదేశించారు. ఆయన వెంట పిహెచ్‌సి వైద్యులు ఎహెచ్.విజయకుమార్, ఎఎస్.కృష్ణవేణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురికి వైసిపి శ్రేణుల పరామర్శ

ప్రజాశక్తి - అంబాజీపేట

అనారోగ్యంతో వారిని, రోడ్డు ప్రమాదంలో గురైన వ్యక్తిని మంగళవారం వైసిపి శ్రేణు లు పరామర్శించారు. మాచవరంలో కోట సత్తిబాబు తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న సూర్యనారాయణను పి. గన్నవరం నియోజకవర్గం వైసిపి కో-ఆర్డినేటర్ గన్నవరం శ్రీనివాసరావు పార్టీ శ్రేణులు మంగళవారం కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైసిపి నాయకులు ఉందుర్తి నాగబాబు కుమారుడు విహాస్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, మండల శాఖ అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్ దొమ్మేటి సత్యమోహన్, అప్పన శ్రీను, మాలే ఆనందరావు, కుసుమ శ్రీను, వరలక్ష్మి, మట్టపర్తి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ విక్రయాలు నిషేధించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - రామచంద్రపురం

తూర్పుగోదావరి జిల్లాలో పౌల్ట్రీ పై వ్యాపిస్తున్న బర్డ్ ఫ్లూ ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటికే వ్యాధి వల్ల వేలాదిగా ఫారం కోళ్లు బాయిలర్ కోళ్లు మరణిస్తుండడంతో పలు ప్రాంతాల్లో కోడి మాంసం అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో వ్యాపిస్తున్న బర్డ్ ఫ్లూ మరింత ఉధతం కాకముందే చికెన్ అమ్మకాలను నిషేధించాలని పలు ప్రజాసంఘాల నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బర్డ్ ఫ్లు పై అధికారులు సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెన్నపల్లి భీమశంకరం, పిడిఎస్‌యు నాయకులు సిద్ధు, మత్స్యకార సంఘం నాయకులు దోమ ఆదినారాయణ, మైనార్టీ బిసి సంఘం సభ్యులు యాట్ల నాగేశ్వరరావు, దళిత నాయకులు రేవు నాగేశ్వరరావు, గొబ్బల శ్రీనివాసరావు తదితరులు చికెన్ నమ్మకాలు నిషేధించాలని దీనిపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

మహిళల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రస్తుత సమాజంలో మహిళలు అభివద్ధి చెందడానికి ప్రభుత్వంతో పాటు స్వర్ణాంధ్ర లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వాటిని అందుకొని మహిళలు ఉన్నత శిఖరాలకు చేరాలని జీవిత బీమా సంస్థ రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్వర్ణాంధ్ర స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన 76వ బ్యాచ్ కుట్టు శిక్షణ ముగింపు సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతర కృషి, పట్టుదల, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నవారే అభివృద్ధి బాటలో పయనిస్తారన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ మహిళల కోసం టైలరింగ్, డ్రెస్ మేకింగ్, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు రాంబాబు సేవలను కొనియాడారు..స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ 27 ఏళ్లుగా 18 వేల మందికి పైగా మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. స్వర్ణాంధ్రకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్కుల్లో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందించారు. 50 మందికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. 77వ బ్యాచ్ తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంధ్యారాణిని స్వర్ణాంధ్ర పక్షాన దుస్సాలువుతో సత్కరించి జ్ఞాపికను అందించారు. నూతన దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ దివ్య, సిబ్బంది, ధనలక్ష్మి, మీరా కుమారి, ప్రసాద్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్యతో సులభతర సేవలు

ప్రజాశక్తి - కడియం

సాగు భూమి ఉన్న ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరమవుతాయని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. రిజిస్ట్రీ పోర్టల్లో వివరాలు నమోదు చేసిన తర్వాత భూమిగల ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ నెంబర్ ఎంత ముఖ్యమో ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య అంతే అవసరమని తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర సబ్సిడీలు, పలుసేవలు రైతులు పొందొచ్చన్నారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై సూక్ష్మ సేద్య పథకాలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలుంటుందన్నారు. ఆధార్ నంబరు, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు, భూమి రికార్డు (పట్టాదారు పాస్బుక్) జిరాక్స్ తీసుకొని గ్రామ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

చేపలు, మటన్ ధరలకు రెక్కలు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలంలో అమాంతంగా పెరిగిన చేపలు మటన్ ధరలు జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలికంగా చికెన్ అమ్మకాలను నిషేధించారు. దేవరపల్లి మండలంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల సిబ్బంది మార్కెట్ వద్దకు వెళ్లి చికెన్ షాప్ ల వద్ద చికెన్ అమ్మ వద్దని నోటీసులు జారీ చేశారు. ఈ తరుణంలో చికెన్ మార్కెట్లో దొరకపోవడంతో చేపలు మటన్ వ్యాపారాలు ఊపందుకున్నాయి. బర్డ్ ఫ్లూ కలకాలంతో చికెన్ వ్యాపారస్తులు నిరాశతో కొట్టుమిట్టాడుతుంటుంటే మరోపక్క చేపలు మటన్ వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు . ఇదే అదునుగా నిన్న మొన్నటి వరకు ఉన్న ధరల కంటే అధిక ధరలకు మాంసం విక్రయిస్తున్నారని జనం గగ్గోలుపెడుతున్నారు..

ఆకుకూరలతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆకుకూరలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని, గర్భిణులు, బాలింతలు రోజువారీ ఆహారంగా తప్పకుండా ఆకుకూర ఉండేలా చూసుకోవాలని ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలయో అన్నారు. మంగళవారం బౌద్ధ ధమ్మ పీఠం ఆవరణలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీలు పండించిన ఆకుకూరలను పంపిణీ చేశారు. సిడిపిఒ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలు స్వయంగా ఆకుకూరలు పండించుకునేందుకు 10 సెంట్ల స్థలం కేటాయించామన్నారు. దీనికి సహకరించిన అనాలయోకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు కళారావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

జూదాల నియంత్రణకు చర్యలు వేగవంతం

మరపడవపై జూదాల స్థలాలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నదీ పరివాహక ప్రాంతం చుట్టూ గుట్టుగా సాగుతున్న జూదాలను అదుపు చేసేందుకు చర్యలను వేగవంతం చేసినట్లు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతమైన ముమ్మిడివరం, ఐ.పోలవరం, అయినవిల్లి, కోరంగి, పామర్రు తదితర ప్రాంతాల్లో గుట్టుగా సాగుతున్న జూదాల స్థలాలను గుర్తించి, అరికట్టేందుకు ఎస్ఐల బృందం చర్యలు చేపటింది. నది పరివాహక మండలాల ఎస్ఐల బృందం మంగళవారం గోదావరిలో మర పడవలపై విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఇసుక మేటల్లో జరిగే జూదాల స్థలాలను ఈ బృందం జల్లెడ పట్టింది. జూదాలను అదుపు చేయడమే ధ్యేయంగా అన్వేషణ చర్యల్లో భాగంగా ఈ గాలింపు చర్యలు చేపట్టమని ఎస్ఐ బృందం తెలిపింది.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టు రామచంద్రపురం
O.S.12/2017
Between
ములకల సత్యనారాయణ ...పిటిషనర్/వాది
And
ములకల బాపన్న @ బాపినీయుడు(డైడ్) & others ...డిఫెండెంట్
6th డిఫెండెంట్ వైట్ల అన్నపూర్ణ, W/o.వీర్రాజు, 53 years, House wife, పానికపల్లి విలేజ్, కె.గంగవరం మండలం, డా॥జి.ఆర్.వి.కోనసీమ జిల్లా
ప్రకటన
మీకు పై నెంబరు కేసులో పిటిషనర్/ప్లైన్‌టిఫ్ తరుపున కోర్టు వారి ఆర్డరుపై ఎన్ని పరియాయములు మీకు నోటీసులు పంపినను మీరు బుద్ధి పూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డరు వేశారు. మీరు ది.18-02-2025 తేదీన కోర్టు వారి ఎదుట ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గానీ లేదా లాయర్ ద్వారా గాని హాజరు కావలెను. లేని యడల శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
బి.హెచ్.పద్మనాభరాజు
సూరంపూడి గంగాధరం
అడ్వకేట్స్, రామచంద్రపురం
9877474986

క్రీడాజ్యోతి వెలిగించి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన ప్రిన్సిపల్

'భాష్యం'లో బాలికల స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక భాష్యం పాఠశాలలో ఈస్ట్ జోన్-3 బాలికల స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు.మంగళవారం భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ సూరిబాబు ఆధ్వర్యంలో జడ్ఇఒ జెవి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిఆర్‌సి స్పోర్ట్స్ డైరెక్టర్ యన్.వీరరాఘవ రెడ్డి, స్థానిక భవాని ఆసుపత్రి డాక్టర్ భీమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సూరిబాబు మాట్లాడుతూ పాఠశాల మైదానంలో స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, త్రోబాల్, ఖోఖో, రన్నింగ్, టెన్నీకాయిట్, షార్ట్‌పుట్, క్యారమ్స్, చెస్ క్రీడలు నిర్వహిస్తున్నామని అన్నారు. స్పోర్ట్స్‌మీట్‌లో అమలాపురం, రావులపాలెం, కొత్తపేట, మండపేట, ముమ్మిడివరం, మలికిపురం, తాటిపాక, పాలకొల్లు, నరసాపురం భాష్యం పాఠశాలల క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాల ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న మండల లీగల్ సెల్ కమిటీ ఛైర్మన్ తదితరులు

వికలాంగుల సర్వేకు కమిటీ నియామకం

ప్రజాశక్తి - రాజోలు

మండల న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా వికలాంగుల సర్వే నిర్వహించేందుకు వైద్యులు, న్యాయవాదుల, పారాలీగల్ వాలంటీర్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలతో ఒక కమిటీ నియామకం చేపట్టినట్లు మండల లీగల్ సెల్ కమిటీ ఛైర్మన్ ప్రమీల రాణి తెలిపారు. మంగళవారం సర్వే కు సంబంధించి కోర్టు ప్రాంగణంలో కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల్లో ఉన్న గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టి శారీరక, మానసిక వికలాంగుల వివరాలు సేకరించి వారికి విద్య,వైద్య సదుపాయాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవాలని అన్నారు. అవసరమైతే సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి సదరమ్ సర్టిఫికెట్లు, పింఛన్ మంజూరు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి.రజిత, ఐసిడిఎస్ సిడిపిఒ రమాదేవి, వైద్యాధికారి మణి కుమార్, ఫణి కిరణ్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ క్రాంతి కుమారి, పారాలీగల్ వాలంటీర్లు మహాలక్ష్మి, సురేంద్ర కుమార్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ సీసాలో పాలు తాగి అస్వస్థత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కోలుకుంటున్న బాధితుడు

ప్రతీ రోజు మాదిరిగానే పాలు తీసుకురాగా, వాటిని కాచుకుని తాగి వ్యక్తి ఆసుపత్రి పాలై చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలు ఇవి.. సిహెచ్.గున్నేపల్లి నల్లా వారి పేటకు చెందిన సబ్బతి రాంబాబుకు మంగళవారం పాలు తీసుకువచ్చే వ్యక్తి రోజూలాగే బాటిల్‌లో పాలు తెచ్చాడు. అయితే రాంబాబు వాటిని కాచి తాగిన కొద్ది సేపటికే వికారం, వాంతులు, వీరేచనలు కావడంతో స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని ముమ్మిడివరంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించడంతో అతడు కోలుకుంటున్నాడు. కుటుంబ సభ్యులు పాలు బాటిల్‌ను పరిశీలించగా పెట్రోల్ పోసే బాటిల్‌ను పాలు బాటిల్‌గా భావించి దానిలో పాలు తీసుకురావడమే కారణమని గుర్తించారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యము నిలకడగా ఉందని తెలిపారు.

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
I.A.No.91/2024 in O.S.No.444/2017
Between
Tanneru Raju ...Petitioner /Plaintiff
And
Smt.Madhu Chandan(Dadi)and Others ...Respondents/Dependants
4. Adapa Vijaya Venkat Banny, S/o. Ramakrishna, Hindu, aged 23 years Student, D.No.5-205, Sriramapuram H/o.Palacherla, Rajanagaram Mandal
5. Adapa Siva Narender,S/o. Ramakrishna, Hindu, aged 22 yearsStudent, D.No.5-205, Sriramapuram H/o. Palacherla, Rajanagaram Mandal
4,5,Respondents/Deffendants
పై నెంబరు పిటీషన్ 4,5, రెస్పాండెంట్స్ /డిఫెండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయు చున్నారు. కావున ది.17-02-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
G.S.S.మురళీ మోహన్
G.V.రామలక్ష్మి
రాజమండ్రి 11-02-2025 అడ్వకేట్స్ రాజమండ్రి

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో
SOP No.01/2025
Between:-
1. ముంగర గోపాలం, s/o.పెద్దిలయ్య, వయస్సు, 59 సం॥లు, D.No.3-73-2. తాడిమళ్ళ
2. ముంగరరామకృష్ణ , s/o.పెద్దిలయ్య, వయస్సు, 53సం॥లు, D.No.3-73.తాడిమళ్ళ
3. ముంగరనాగభూషణం, s/o.పెద్దిలయ్య, వయస్సు, 52సం॥లు, D.No.3-73-1A.తాడిమళ్ళ
4. ముంగర లక్ష్మి, W/o.(Late) వెంకటేశ్వర్లు,వయస్సు, 58సం॥లు, D.No.3-74-2,తాడిమళ్ళ
5. ముంగర గోపాలం, s/o.(Late) వెంకటేశ్వర్లు వయస్సు, 41సం॥లు, D.No.3-74-2.తాడిమళ్ళ
6. ముంగర సత్యన్నారాయణ , s/o. వెంకటేశ్వర్లు వయస్సు, 39సం॥లు, తాడిమళ్ళ ...పిటిషనర్స్
మరియు
ది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిమళ్ళ బ్రాంచ్, తాడిమళ్ళ, నిడదవోలు మండలం. ...రెస్పాండెంట్
వాయిదా 27-02-2025
ఈ నెంబరు Sussession OP ని పిటిషనర్స్ తాడిమళ్ళ State Bank of India నందు ముంగర వీరయ్యగారు వేసిన 2 ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్ము 1 నుంచి 6 పిటిషనర్స్ వారసులు తీసుకొనుటకు గాను తాడిమళ్ళ State Bank of India వారిపై వేసిన Sussession OP నందు ఎవరికైనా అభ్యంతరములు వున్నయెడల పై కోర్టు వారి ఎదుట ది.27-02-2025 ఉదయం గం॥10.30 ని॥లకు స్వయముగాగాని వకీలు ద్వారాగా గాని మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లు కాని పక్షమున పరోక్షమున తీర్మానించబడును.
M.S.S.Chakrapani
కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు,
ది.08-02-2025 సెల్.9347628845